
# పాస్‌వర్డ్

సుప్రభాతం వీక్లీ.. 13 జూలై, 2002




'కళ్ళు వెళ్లే చోటికి మనసు వెళ్లకూడదు. మనసు వెళ్లే చోటికి మనిషి వెళ్లకూడదు.'

– హిమ మాటలు గుర్తుకు వచ్చేసరికి... రేవంత్‌కి పెదాల మీద చిన్న దరహాసం కదలాడి వెంటనే మాయమైంది.

తన హృదయం ఎప్పుడూ ఆమె గుండె లోతుల వైపు తొంగిచూస్తూ ఉంటుంది. మనసు చేసే సయ్యాటలో ఎప్పుడూ తనదే పైచేయి కావాలనుకుంటాడు.

మనసైన మగువ– సొగసైన అందాలతో తనని మంత్రముగ్ధుణ్ణి చేస్తూంటే... తనువు వెండి వెన్నెలలోని ధృవతారలా వెలుగొందుతుంది.

"హిమూ! అందాలు మీవి, ఆనందం మాది... ఏమంటావు?"

"అవును. అసలు ఆనందం కోసమే అందాలు విరబూస్తాయనుకుంటా!"

"ఏదిఏమైనా... నీ మురిపెం నాకు గమనాన్ని నిర్దేశిస్తోంది."

"థాంక్యూ!" అంటూ అనురాగాన్ని వర్షిస్తూ ఎదసౌధంపై లాలనగా వాలిపోయేది.

అదంతా గతం..! మరి, వర్తమానం?!

ఆనందాన్ని పాలుపంచుకోవలసిన ఈ వయసులో ఆమె తనచుట్టూ కంటికి కనిపించనంత సన్నని గిరి గీసుకుంటోంది.

'ఇరవైలో అరవై' అంటే ఇదేనేమో..?!

కానీ, ఆ మౌనం- అమెరికాలో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై జరిగిన దాడిలా అతన్ని అతలాకుతలం చేస్తోంది.

ఒక్కసారి రేవంత్ హృదయం చివుక్కుమంది.

మనిషి జీవితకాలాన్ని, ఆయుష్షుని విధాత ఎప్పుడో లిఖించివుంటాడు. ఇన్‌బిట్వీన్ బర్త్ అండ్ డెత్ ఉయ్ హావ్ సర్టెన్ ఫిక్సిడ్ టైమ్ విచ్‌వజ్ ఫిక్సిడ్ బై నేచర్ అండ్ గాడ్!

మంచి అయినా- చెడు అయినా, సంతోషమైనా- దుఃఖమైనా, ఆనందమైనా- ఆవేదనైనా... మానవుడు అనుభవించగలిగేది ఆ నిర్దేశిత జీవితకాలంలోనే!

జీవితాన్ని సుఖమయం చేసుకోగలిగినవాడు 'వివేకి'గా మిగిలిపోతాడు. మనిషి తిరిగి పొందలేనిదంటూ ఏదైనావుంటే... అది 'గతం' ఒక్కటే!

కరిగిన కాలం ఎప్పుడూ కమనీయంగా, మధురంగా ఉండాలి. లేకుంటే జ్ఞాపకాలు కఠిన శిలలా మారి, జీవితాంతం గుండెను గుచ్చుతూనే ఉంటాయి.

ఆ విషయంలో రేవంత్ చాలా ఆవేదన చెందుతాడు. హిమ చాలా మంచిఅమ్మాయి. పెళ్ళికి ముందునుంచి కూడా ఆమె తనతో చాలా సోషలిస్టిక్‌గా ఉండేది. నవ్వుతూ, నవ్విస్తూ తనని సేదదీర్చేది. అటువంటిది- ఆమెలో తెలియని మార్పు! అసలు ఆ నవ్వు, ఆ ఆనందం ఏమైపోయాయో..?!

"ఏమండీ..."

హిమ పిలుపుతో వాస్తవంలోకి వచ్చిన రేవంత్-

"ఈరోజు రవీంద్రభారతిలో గిరిజాశంకర్ సంగీత విభావరి ఉంది. ఇన్విటేషన్ కూడా వచ్చింది. సాయంత్రం ఆరుగంటలకు రెడీగా వుంటే పికప్ చేసుకుని వెళతాను. డిన్నర్ బయట చేసిరావచ్చు." అన్నాడు.

"మీరు వెళ్లిరండి! అయినా... అనంత్‌కి వారంరోజుల్లో మంత్లీ ఎగ్జామ్స్! కూర్చోబెట్టి చదివించాలి. ఇలా 'ప్రోగ్రామ్స్' అంటూ ప్రొద్దుపోయేదాకా తిరుగుతూ కూర్చుంటే ఎలా? ఇంటిపనులు చేసుకోవాలి, పాలు తెచ్చుకోవాలి. నైట్ చాలాసేపు మేలుకొనివుంటే మర్నాడు ఆఫీసు కెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది!"

ఒకింత నొచ్చుకోవడం రేవంత్ వంతయింది.

"చెప్పడం మరిచాను... నారాయణమూర్తిగారి అమ్మాయి వెడ్డింగ్ ఇన్విటేషన్ వచ్చింది. మ్యారేజ్ బాపట్లలోనే చేస్తున్నారట. మనం తప్పక అటెండ్ అవ్వాలి" అన్నాడు.

"చూద్దాం! ఇంకా టైముంది కదా! మాకు ఆఫీస్‌లో ఈరోజు ఇన్‌స్పెక్షన్ వుంది. ఈరోజు ఒక గంట ఎర్లీగా వెళ్లాలి. లంచ్‌బాక్స్ రెడీ చేశాను. అనంత్‌ని కాన్వెంట్‌కి పంపి, మీరు వెళ్లండి!" మరోమాటకు అవకాశం లేకుండా చకచకా వెళ్లిపోయింది.

ఒక్కసారి రేవంత్‌కి నిస్సత్తువ ఆవహించింది.

లైఫ్ బొత్తిగా మెకానికల్ అయిపోయింది! ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరి పనులతో వాళ్ళు బిజీ అవుతున్నారు గానీ, కొంచెంకూడా ఎంజాయ్‌మెంట్ కనబడటం లేదు.

ఎదురుగా... నారాయణమూర్తిగారమ్మాయి పెళ్ళి శుభలేఖ గాలికి కొంచెంకొంచెం ఎగిరి తనని ఎగతాళి చేస్తున్నట్లు అనిపించింది. ఆయన బాపట్లలో రేవంత్ ఇంటి ఓనరు. తదేకంగా దానినే గమనిస్తున్న రేవంత్ ఊహలు గతంవైపు పరుగులు తీశాయి.

• • •

రేవంత్ తండ్రి ఆనందరావు హైస్కూలు హెడ్మాస్టరు!

సాధారణంగా టీచింగ్ ప్రొఫెషన్‌లో ఉన్నవారి పిల్లలు చదువుసంధ్యలలో బాగా రాణిస్తారన్నదానిని నిజం చేస్తూ... ఎకడమిక్ కెరియర్‌ని బాగానే పికప్ చేశాడు.

చదువుసంధ్యలలో, ఆటపాటలలో ఎప్పుడూ ముందువుండే రేవంత్- ఎంసెట్‌లో మంచి ర్యాంకు సంపాదించాడు.

"బాపట్లలో భగవతిరావు అని నా చిన్ననాటి స్నేహితుడు ఉన్నాడు. వాడు అక్కడ లీడింగ్ ఇన్‌కంటాక్స్ ప్రాక్టీషనర్. నేనంటే ప్రాణం ఇస్తాడు. కౌన్సిలింగ్‌లో నువ్వు బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ ప్రిఫర్ చేస్తే బాగుండదని నా ఉద్దేశం!"

తండ్రి మాటలు రేవంత్‌కి నిజం అన్పించాయి. 'తెలిసివున్న వాళ్ళుంటే కొంత మోరల్ సపోర్ట్' అని బాపట్లలో చేరాడు.

భగవతిరావుగారు మంచి సహృదయులు. తన చిన్ననాటి స్నేహితుని కొడుకుని చాలా ఆదరంగా చూసేవారు. తన నైబర్ నారాయణమూర్తి ఇంట్లో రూమ్ ఇప్పించారు.

భగవతిరావుగారమ్మాయి హిమ! చాలా చక్కనైన అమ్మాయి! రూపలావణ్యంతో పాటు హృదయలావణ్యం కలిగిన అతివ కావడంతో- అందరూ ఆమెను 'ఒరిజనల్ బ్యూటీ' అని పొగిడేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే... అందానికే అందం హిమ! అగ్రికల్చర్ బి.ఎస్సీ.లో చేరిన ఆమె- ఓ పచ్చని హరితం! ఆమె నవ్వు నిండైన వసంతానికి సంకేతం!

ఆమెతో మాట్లాడాలనీ, స్నేహం చేయాలనీ కుర్రాళ్ళు కలలు కనేవారు. ఎప్పుడూ పాతసినిమాల్లో అక్కినేనిలా ఇన్‌షర్ట్ చేసి, ప్యాంటు జేబులో చేతులు పెట్టుకుని హుందాగా ఉండే రేవంత్‌ని- ఒక పెదవి విరుపుతో, చిన్న చిరునవ్వుతో పలకరిస్తుంది. ఆ నవ్వు- రేవంత్ నవతంత్రుల్ని ప్రేరేపిస్తాయి.

'చిరునవ్వుతో విచ్చుకునే పెదవులు, ముగ్ధత్వం ఉట్టిపడే చూపులు, అణువణువునా లావణ్యం తొణికిసలాడే శరీరం... అవన్నీ ఆడదాన్ని సొత్తు!' రేవంత్ మనసు ఎందుకో హాయిని గొలుపుతోంది.

"చదువుకునే వయసులో చదువు మీద కాన్సన్‌ట్రేషన్ ముఖ్యం! అంతేగానీ, పోకిరి వేషాలతో ఎక్స్‌ట్రాలు పోతే చాలా చికాకుగా ఉంటుంది!" ఒకసారి ఎవరినో ఉద్దేశించి హిమ అన్నమాటలు రేవంత్‌లో చదువు పట్ల మరింత శ్రద్ధను పెంచాయి.

మొత్తానికి- డిస్టిన్క్షన్‌లో పాసైన రేవంత్... క్యాంపస్ ఇంటర్వ్యూలోనే మంచిఉద్యోగం సంపాదించాడు.

పోస్టింగ్ హైదరాబాద్‌లో ఇచ్చారు.

రేవంత్ గుణగణాలు భగవతిరావుకి బాగా నచ్చాయి. బుద్ధిమంతుడైన కుర్రాడు, చురుకైన వ్యక్తిత్వం! అమ్మాయి చేష్టలు కూడా రేవంత్ పట్ల ఇష్టాన్ని తెలియజేస్తున్నాయి. అందుకే అతన్ని తన అల్లుడిగా చేసుకోవాలనుకున్నారు.

ఆనందరావుకి ప్రపోజల్ పంపారు. అటువైపు నుంచి కూడా రెస్పాన్స్ పాజిటివ్‌గా వచ్చింది. రేవంత్, హిమల వివాహం నిశ్చయమైంది.

ఇప్పుడు రేవంత్‌కి- హిమ కొత్తకోణంలో కనబడుతోంది.

తొలిచూపులోనే నిజమైన ప్రేమ ఉద్భవించడం అనేది అంత సులభంగా జరగదు. కొద్దిమందికే జరుగుతుంది. కొన్ని సంవత్సరాలుగా మనం ఎవరికోసం వెతుకుతున్నామో ఆ తెలియని వ్యక్తి హఠాత్తుగా 'హిమ'రూపంలో తనకు ఎదురుపడినట్లు అనిపించింది మొదట్లో- రేవంత్‌కి.

'కోరిన కోమలి తన భార్య!' అన్న అనుభూతి చిరుగాలిలా హృదయాన్ని తాకి స్పందింప జేస్తోంది. ముఖం ప్రఫుల్లమవుతోంది.

తన ఆరోగ్యం బాగాలేకపోవడంతో- పెళ్ళి అయిపోతే బాధ్యత తీరిపోతుందని భావించారు భగవతిరావు. హిమ పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలనుకోవడంతో- పెళ్ళి అయిన తరువాతైనా చదువుకోవచ్చని అందరూ కితాబు ఇచ్చారు.

ఆరోజు... హిమ పుట్టినరోజు!

సాయంత్రం 'సూర్యలంక' బీచ్ కెళ్లారు. ఎదురుగా... సముద్రం! చాలాసార్లు చూసినా ఆరోజు ఎందుకో అందంగా కన్పించి భావుకత కలుగజేస్తోంది. సంతోషంతో కెరటాలు చేతులు చాచి ఆహ్వానిస్తున్నట్లు ఉరికి ఉరికి వస్తున్నాయి. ఆ ఘోష గమ్మత్తుగా ఉంది.

ఎప్పుడూ 'హిమ'లా గుంభనంగా ఉండే సాగరుడు- అవధులు లేని భావావేశంతో ఉప్పొంగుతున్నాడు.

"తీవ్రమైన మనస్తాపం చెందినా, పట్టలేనంత సంతోషం కలిగినా మనిషి ఒంటరిగా ఉండలేడు. దేన్నయినా ఆశ్రయించాలి. హిమూ! నా భాషకు భావం నీవు!"

ఆమె అతన్ని అపురూపంగా చూస్తోంది.

కెరటం వచ్చినప్పుడు ఒకరినొకరు పట్టుకుని తోడుగా నిలబడుతున్నారు. నీళ్లు చల్లగా ఉన్నాయి. హిమ పాదాలు ఇసుకలో బంగారుపూలలా మెరుస్తున్నాయి.

ఎర్రటి నీరెండలో కెరటాల నురగ పాలకడలిలా మెరుస్తోంది. ఒక్కో కెరటం వచ్చి వారి పాదాల దగ్గర తమని తాము అర్పించుకుని వెళ్లిపోతున్నాయి.

చీకటీ, ఎండా రెండూ లేని ఆ వింతవెలుగులో జీన్స్, టీషర్టలతో హుందాగా నిలబడివున్న అతను- కెరటం వచ్చినప్పుడు కాళ్ల క్రింద ఇసుక కదిలిపోయినా కంగారు అనేది లేకుండా నిశ్చలంగా నిలబడివున్నాడు.

ఆ సంధ్యాకాంతిలో అతను హిమను చూస్తున్నాడు...

యవ్వనం విరబూసినట్లున్న ఆ ముఖంలో చిలిపితనం, మంచినతనంతో పాటు అనురాగాన్ని వర్షిస్తోంది. ఆ కళ్ళలో తనకి కావాల్సినది పొందానన్న తృప్తి కనబడుతోంది.

"రేవూ! చాలా మంచి అదృష్టం అంటే... 'ఐశ్వర్యం' అని అర్థం చెబుతారు. నా దృష్టిలో 'అదృష్టం' అంటే... మనల్ని ప్రేమించే వ్యక్తి తోడు దొరకడం! ఆ తోడు కొండంత అండగా మనిషికి బలాన్నిస్తుంది. 'జీవితంలో ఎలాంటి మిట్టపల్లాలు ఎదురయినా దానితో సునాయాసంగా ఎదుర్కోవచ్చు' అనిపిస్తుంది."

అందమైన పాలరాతి బొమ్మకి ప్రాణం వచ్చినట్లుగా పాలనురగ లాంటి తెల్లని దుస్తులలోని హిమ- అతని మగసిరికి కావ్యనాయికలా కనబడుతోంది.

"హిమూ! నీతోటి నాకీ ప్రపంచం అద్భుతంగా ఉంది. నీ పరిచయం నాకు జీవితం మీద మమకారం పెంచింది. వేయి సంవత్సరాలు బ్రతికినా తనివి తీరదేమో అనిపిస్తోంది."

తృప్తిగా నవ్వుతున్న ఆమెను వలపువీచికల్లా కెరటాలు ఒకటి... దాని వెనుక మరొకటి... వెంటనే వేరొకటి... వచ్చి తుషారనాదంతో ముంచెత్తుతున్నాయి.

ఒక్కసారి ఆమెను అదిమి పట్టుకున్నాడు... ఇద్దరూ తడిసి ముద్దయిపోయారు.

అందమైన తీగకు పందిరి ఆధారం దొరికినట్లు మల్లెతీగలా రేవంత్‌ని అల్లుకుపోయింది. ఆమె తడిసిన అందాలు అతనిలో ఘనీభవించిన హిమకుధ్యాలను కరిగించివేస్తున్నాయి.

"మురిపెమైన ముగ్ధ... ఎంత మోహనంగా ఉందో తెలుసా?" తనివితీరా మరింత దగ్గరకు లాక్కున్నాడు. అతనిలో గువ్వలా ఒదిగిపోయిందామె. రగులుతోన్న కన్నెవయసు అతని ఎద దుర్గాన్ని ఆక్రమించుకుంటోంది.

"కళ్ళు వెళ్లే చోటికి మనసు వెళ్లకూడదు... మనసు వెళ్లే చోటికి మనిషి వెళ్లకూడదు."

"ఉహూఁ..." సుతారంగా ఆమె నుదుటిపై చుంబించాడు.

"మగాడికి అంత ఆతృత పనికిరాదు."

"బాతింగ్ బ్యూటీ!"

"అంత అందంగా ఉన్నానా..?"

"అవును... బాబూ!"

"అంటే..?"

"బాబూ' అంటే... బాతింగ్ బ్యూటీ!"

"మరొక్కసారి!"

"బాతింగ్ బ్యూటీ..!"

"ఇంకోసారి!"

"ఎస్! యు ఆర్ మై బాతింగ్ బ్యూటీ!" కొంటెతనం నిండిన కళ్ళతో ఆమెను కవ్విస్తున్నాడు.

"వద్దు... చూపులతో చూలాలొస్తుంది."

'ఎలా వచ్చినా పుట్టే బాబుకి బాబును నేనే!"

"కళ్ళు వెళ్లే చోటికి మనసు వెళ్లకూడదు. మనసు వెళ్లే చోటికి మనిషి వెళ్లకూడదు."

"ఫరవాలేదు అమ్మాయిగారూ! వ్యవసాయ శాస్త్రంలో పచ్చదనానివి, నా హృదయానికి హరిత వనానివి!"

"రేవంత్ నువ్వు నా వలపు వీచికవి! మనిషిలో భావం బంధాన్ని బిగిస్తుందట... అనుభూతి ఆలాపన స్థితిని తప్పిస్తుందట! అలా చూడకపోతే నన్ను కొరుక్కు తినేయకూడదూ?"

"నేను పక్కా వెజిటేరియన్‌ని!" కొంటెకోణంగి పలుకులకు పరవశిస్తున్నాడు.

మొత్తానికి ముంచెత్తిన కెరటం వారిద్దరిలో ప్రేమ కవాటాన్ని యాక్టివేట్ చేసింది. క్రమంగా హిమ- రేవంత్‌కి మానసికంగా దగ్గరవసాగింది. ఆమె ఎంత మూడీగా వున్నా 'బాతింగ్ బ్యూటీ' అని పిలిస్తే పగలబడి నవ్వేది... ఆనందంతో మురిసిపోయేది.

పెద్దల మాట మీద రేవంత్, హిమల పెళ్ళి జరిగిపోయింది. రేవంత్ హైదరాబాద్ షిఫ్ట్ అయిపోయాడు. హిమ పోస్టుగ్రాడ్యుయేషన్‌లో చేరింది. ఫోర్స్‌డ్ బ్యాచిలర్ ఇక్కట్లు వీరికి తప్పలేదు.

అసలు పెళ్ళి అయిన మరునాటి నుండి భార్యభర్తలు కలసి ఉండాలంటారు. హనీమూన్ ట్రిప్స్ వైవాహిక బంధానికి గట్టి పునాది లాంటివి. చేదోడువాదోడుగా ఒకరినొకరు అనురాగాల్ని, అభిప్రాయాల్ని షేర్ చేసుకున్నప్పుడే వారి దాంపత్యం సుఖవంతమవుతుంది. భార్యాభర్తలుగా మనుగడ సాగించాలంటే శారీరక సుఖం ఒక్కటే ముఖ్యం కాదు. అనునిత్యం కలసి సహజీవనం సాగించాలి. ఎప్పుడూ మొనాటనీ స్టీరియో టైపు యాక్టివిటీస్ తొలగించుకోవాలి. లేకపోతే ఏదో కొత్తదనం వెదుక్కోవాలి. చికాకుతో ఇంటికి వచ్చినప్పుడు భోజనానికి బయటకు వెళ్లడం, ఇంటిలో కొత్తదనమిచ్చేలా ఇంటీరియర్ డెకరేషన్, ఆఫీసు విషయాలు డిస్కస్ చేసుకోవడం, మాటలు రొటీన్ కాకుండా ఇంప్రెసివ్‌గా ఉండేటట్లు చూసుకోవడం వంటివి ఆ బంధాన్ని పటిష్ట పరుస్తాయి.

'దూరం' మనుషుల మధ్య అంతరాన్ని పెంచుతుంది. పెళ్ళయిన కొత్తలో చదువుల పేరిట, ఉద్యోగాల పేరిట భార్యాభర్తల ఎడబాటు వారిలో ఒకవిధమైన ఉదాసీనత కలుగజేస్తుంది. తద్వారా ఒంటరితనాన్ని అలవాటు చేస్తుంది. దానిని అభిప్రాయ భేదం అనడం సరికాదు గానీ, ఇద్దరిలో కంటికి అగుపించని నైరాశ్యపు పొర ఏర్పడుతుంది. తద్వారా జీవితం అన్నీ వున్నా- ఏమీలేనట్లు అనిపించి, రోజులు మెకానికల్‌గా గడుస్తూ వుంటాయి.

రేవంత్ హిమల విషయంలో జరిగిందిదే! వారిలో వెనుకటి ఉత్సాహం చల్లబడిపోయింది. జీవితాన్ని పంచుకున్నది పెద్దగా లేకపోయింది.

హిమ తల్లి అయింది..! కొడుకు పుట్టాక వాడి ఆలనా పాలన, తన ఉద్యోగం ప్రియారిటీస్ కావడంతో విషయం మొదటికొచ్చింది.

రేవంత్ ఇదివరకటిలా ఆమె హేపీగా ఉండాలని కోరుకునేవాడు. దానికోసం పండుగలకి ఖరీదైన చీరలు కొనితెచ్చాడు, బంగారపు నగలు చేయించాడు. ఇంట్లోకి కావాల్సిన హంగులన్నీ సమకూర్చాడు. కానీ, తను కోరుకుతన్న ఆనందాన్ని ఆమెవద్ద పొందలేకపోతున్నాడు.

• • •

నారాయణమూర్తిగారమ్మాయి పెళ్ళి నిమిత్తం బాపట్ల వచ్చిన రేవంత్, హిమలు కొడుకును తమవాళ్ళ దగ్గరుంచి, చూసొద్దామని 'సూర్యలంక' బయలుదేరారు.

ఆమె పక్కన నడుస్తున్న అతనికి హిమ పుట్టినరోజు జ్ఞాపకం వచ్చింది.

అప్పుడూ, ఇప్పుడూ అదే తెల్లచీర... జడలో అవే విరజాజులు... అదే వయ్యారం... అదే రూప లావణ్యం! ఎటొచ్చీ ప్రియారటీస్‌లో తేడా! అప్పుడు ఆరాధనతో అమృతాన్ని కురిపించిన ఆమె అధరాలు- ఇప్పుడు నిర్వేదనతో బోసిపోయినట్లున్నాయి.

పది సంవత్సరాల తరువాత మరల వచ్చిన జంటను మరచిపోలేదన్నట్లు సముద్రం ఘోషిస్తోంది. కెరటాల బాహువులతో ఆహ్వానిస్తూ ఉరికి ఉరికి దగ్గరకు వస్తోంది. చల్లని నీళ్లు గిలిగింతలు పెడుతున్నాయి.

ఒక్కసారిగా ఒక పెద్ద కెరటం వేగంగా వచ్చి వారిని దిగ్బంధం చేసింది.

ఉలిక్కిపడ్డ హిమ- రేవంత్ కౌగిలిలో ఒదిగిపోయింది.

పూలజల్లులా మీదపడ్డ పెళ్ళాన్ని మరింత దగ్గరగా తీసుకుని పెనవేసుకున్నాడు. ఇద్దరూ పూర్తిగా తడిసిపోయారు.

తడిసిన ఆమె అందాల్ని తేరిపార చూస్తున్నాడతడు.

ఇంతలో... అతనికి ఏదో గుర్తుకువచ్చింది...

చిన్నగా నవ్వుకున్నాడు.

"ఏమిటి నవ్వుతున్నారు?"

"ఏయ్ః... బాతింగ్ బ్యూటీ!"

అదోలావున్న ఆమె ముఖంలో మార్పు కనబడుతోంది.

'నువ్వు... నువ్వు... బాతింగ్ బ్యూటీవి కదూ?!"

మేఘాలు వీడిన జాబిలిలా ఆమెలో చిరునవ్వు!

"ఎస్... యు ఆర్ మై బాతింగ్ బ్యూటీ... యు ఆర్ మై హార్ట్ బీట్!"

పట్టరాని సంతోషంతో ఒక్కసారి గట్టిగా నవ్వింది. అనురాగంతో ఆమె వైపు చూస్తున్నాడతడు.

"ఏయ్ః రేవూ! కళ్ళు వెళ్లే చోటికి మనసు వెళ్లకూడదు. మనసు వెళ్లే చోటికి మనిషి వెళ్లకూడదు."

"ఈ కళ్ళూ... మనసూ... ఏ సినిమాలోనివి?"

చాలా సేపు పకపకా నవ్వుకోవడంతో ఇద్దరి మనసులు తేలికపడ్డాయి.

"ఇలా హాయిగా నవ్వుకుని చాలా కాలమైంది కదూ..?"

"అవును."

"హిమూ! చూశావా... నా పాస్‌వర్డ్ మరచిపోయి ఇంతకాలం ఎంత వేదన చెందానో!"

"పాస్‌వర్డ్ ఏమిటి?"

"అవును. పాస్‌వర్డ్ సంగతి పట్టించుకోకపోవడంతో- పది సంవత్సరాలుగా నా యీ కంప్యూటర్‌లో ఫైలు ఓపెన్‌గాక ఎంత నష్టపోయానో తెలుసా?"

"ఇంతకీ... మీ పాస్‌వర్డ్ ఏమిటి?"

"బాతింగ్ బ్యూటీ!"

ఆనందంతో పగలబడి నవ్వుతోంది.

'రేవూ! ఈ పాస్‌వర్డ్‌తో మూసుకున్న ఎద కవాటాన్ని తెరిపించావు. ఇకనుంచి మన జీవితంలో సుగంధాలు పరిమళించాలని కోరుకుంటాను"

- అనురాగంతో అతని చేతిని తన చెక్కిలి మీదకు చేర్చుకున్న ఆమెను సముద్రుడు ఎత్తిన కెరటంతో మరోమారు సేదదీర్చాడు.